# వాహనాలను సమకూర్చాలి

**జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్**



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి, మే 18 : ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించి అన్‌లోడ్ చేసేందుకు కావాల్సిన వాహనాలను జిల్లా రవాణా శాఖ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు సమకూర్చాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో శనివారం జిల్లా రవాణా శాఖ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో ధాన్యం రవాణాపై సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైతుల ధాన్యం తడవకుండా కొనుగోలు చేసిన వెంటనే లారీలను ఏర్పాటు చేసి మిల్లుల్లో అన్‌లోడ్ చేసేలా సహకరించాలని చెప్పారు. రైస్ మిల్లుల్లో కావాల్సిన ఖాళీ స్థలాలను గుర్తించాలని సివిల్ సప్లై అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జునబాబు, ఇన్‌చార్జి పౌరసరఫరాల మేనేజర్ నిత్యానందం, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్లు, జిల్లా రవాణా శాఖ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మే 18 : ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు, జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఇంటర్మీడియేట్,పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత విభాగాల అధికారులకు శనివారం నిర్వహించిన సమావేశంలో దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంట వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఈ సప్లిమెంటరీ పరీక్షలకు 10,511 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. ఇందులో మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 6,236 కాగా, ద్వితీయ సంవత్సరంలో 4,275 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇందు కోసం జిల్లాలో 29 కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించామన్నారు.

మాల్ ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 869 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. దీని కోసం కామారెడ్డి, బాన్సువాడ కేంద్రాల్లో ఒక్కో కేంద్రంలో పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు.

రెండు కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ అధికారి, కస్టోడియన్లు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి షేక్ సలాం, సభ్యులు శ్రీనాథ్, నాగేశ్వరయ్య, డీఈవో రాజు, ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చంద్రశేఖర్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర, కలెక్టరేట్ సూపరింటెండెంట్ జ్యోతి, విద్యుత్ శాఖ అధికారి మల్లేశ్ పాల్గొన్నారు.

# కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మాచారెడ్డి, మే 18 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సమ్మాళ్వార్ పరమ పదోత్సవం నిర్వహించినట్లు ఆలయ ఈవో శ్రీధర్‌రావు తెలిపారు. ఈనెల 24వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

# ఘనంగా కన్యకాపరమేశ్వరీ జయంతి



గాంధారిలో పూజలు చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డి రూరల్/ గాంధారి/నాగిరెడ్డిపేట/కామారెడ్డి/నస్రుల్లాబాద్/భిక్కనూరు, మే 18: ఎల్లారెడ్డి పట్టణంలో వాసవి కన్యకా పరమేశ్వరీ మాత జయంతి కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దొరవారి హనుమాన్ ఆలయం నుంచి వైశ్య భవన్‌లోని వాసవీమాత ఆలయం వరకు మహిళలు కలశాలతో భారీ ర్యాలీ తీశారు. వేదపండితులు శ్రీనివాస్‌రావు, సంతోష్, మహిళా వైశ్య సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. గాంధారిలో అందంగా అలంకరించిన రథంపై కన్యకా పరమేశ్వరీ అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. నాగిరెడ్డిపేటలోని ప్రధాన వీధుల్లో మహిళలు కలశాల ఊరేగింపు నిర్వహించారు. వైశ్యభవన్‌లో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రాజు, మాణిక్యం, వెంకటేశం, దత్తు, రమేశ్, రాజీవ్, సంజీవ్, రాజేంద్రప్రసాద్, పుండరీకం తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డిలోని సిరిసిల్ల రోడ్డులో ఉన్న వాసవి మాత ఆలయంలో కన్యకాపరమేశ్వరీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో అర్చకులు కాసర్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు,అర్చనలు,తీర్థ ప్రసాద వితరణ తదితర పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. బీర్కూర్‌లో కన్యకాపరమేశ్వరీ జయంతిని నిర్వహించారు. భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో కన్యకాపరమేశ్వరీ జయంతి నిర్వహించారు. వైశ్యసంఘం అధ్యక్షుడు అల్లాడి సుదర్శన్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

## కాలపరిమితి ముగిసిన
# తినుబండారాలను విక్రయించొద్దు



తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారిణి సునీత

కామారెడ్డి, మే 18 : దుకాణాల్లో కాలపరిమితి ముగిసిన తినుబండారాలను విక్రయించొద్దని ఫుడ్ సేఫ్టీ అధికారిణి సునీత అన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ ప్రధాన రహదారుల్లో ఉన్నటు స్వీట్ హోమ్స్‌ను ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఆహారపదార్థాలను తయారు చేసే పరిసరాలు, వస్తు సామగ్రి, ప్యాక్ మెటీరియల్స్ కాలపరిమితి ముగిసిన తేదీలను పరిశీలించారు. వివిధ రకాల వస్తువుల శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు టెస్టింగ్ కోసం పంపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదార్థాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. శుభ్రంగా లేకుండా, కాలపరిమితి తేదీ లేకుండా పదార్థాలను విక్రయించే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ శిరీష, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

# ధాన్యం బస్తాలను వెంటనే తరలించాలి

**ఆర్డీవో రమేశ్ రాథోడ్**

బాన్సువాడ టౌన్, మే 18 : రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం బస్తాలను వెంటనే తరలించాలని ఆర్డీవో రమేశ్ రాథోడ్ సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంలో సొసైటీ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో శనివారం ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతుల ధాన్యం రోడ్లపై ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వారికి ఇబ్బంది కలుగకుండా లారీలను అవసరం రీత్యా వినియోగించుకొని ధాన్యాన్ని ప్రభుత్వ అనుమతి ఉన్న రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో బాన్సువాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని సొసైటీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులు, సొసైటీ కార్యదర్శులతో మాట్లాడుతన్న ఆర్డీవో



ఆరెపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అనిల్ కుమార్

# కొనుగోలు కేంద్రాల పరిశీలన

**ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి**

రాజంపేట్, మే 18 : మండలంలోని పొందుర్తి, ఆరెపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ అనిల్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వెంటనె ధాన్యం బస్తాలను రైస్‌మిల్లులకు తరలించడానికి తగు చర్యలు తీసుకోవాల ని కేంద్రాల్లోని ఇన్‌చార్జిలను ఆదేశించారు. వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# నామమాత్రంగా ఉపాధి పనులు

- మస్టర్లలో బినామీ పేర్లు
- పట్టించుకోని అధికారులు
- నష్టపోతున్న కూలీలు



సిర్పూర్ గ్రామంలో ఉపాధి పనులకు హాజరైన కూలీలు

డోంగ్లీ, మే 18: గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధి కల్పించేందుకు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం లక్ష్యం నెరవేరడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో కూలీలకు గిట్టుబాటు కూలి డబ్బులు రావడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్ల కారణంగా తాము నష్టపోతున్నామని పలువురు కూలీలు ఆరోపిస్తున్నారు. పనిచేయని వారికి కూడా ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లలో హాజరు వేస్తున్నారని, దీంతో పనిచేసిన వారు నష్టపోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని చేయని వారికి హాజరు వేసేందుకు ఎఫ్‌ఏలు డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

**తగ్గుతున్న కూలీల సంఖ్య..**


మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు చేసే కూలీల సంఖ్య క్రమంగా తగ్గుతున్నది. కొన్ని గ్రామాల్లో పని చేసే ప్రదేశం చాలా దూరంగా ఉండడంతో వెళ్లడానికి కూలీలు ఆసక్తిని చూపడం లేదు. మండలంలోని కుర్ల, ఎన్‌బురా, ఇలేగావ్‌లో ఇప్పటి వరకు ఉపాధి పనులు మొదలుకాలేదు. ఆయా గ్రామాల్లో అధికారులు ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించలేదు. మండల కేంద్రాల్లో ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహించి ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదని గ్రామీణ ప్రజలు అంటున్నారు.

**అధికారుల పర్యవేక్షణ కరువు..**

గ్రామాల్లో ఉపాధి పనులు సక్రమంగా జరుగుతున్నాయా..? లేదా..? అనే విషయమై ఉన్నతాధికారులు పర్యవేక్షించడం లేదు. కూలీల సంఖ్య ఎందుకు తగ్గుతున్నది..? లోపం ఎక్కడ ఉన్నదనే విషయాన్ని వారు గుర్తించడం లేదు. ఎప్పుడో ఒకసారి చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారే తప్ప పనులను పర్యవేక్షించడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. ఇలా జరిగితే గ్రామీణ ప్రాంతాల ఎలా అభివృద్ధి చెందుతాయని, కూలీల ఆర్థిక పరిస్థితి ఎలా మారుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆయా గ్రామాల కూలీలు కోరుతున్నారు.



డోంగ్లీలో చేపడుతున్న ఉపాధి పనులు



హాజరు వేయకుండా మస్టర్‌లో సంతకాలు

# మొక్కలు ఎండిపోకుండా చూడాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీవో మహబూబ్

బిచ్కుంద, మే 18: నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీవో మహబూబ్ అన్నారు. మండలంలోని బండారెంజల్, గుడెనెమ్లి, వాజీద్‌నగర్ గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. డంపింగ్ యార్డు, వైకుంఠ ధామం, నర్సరీలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున నర్సరీలో మొక్కలు ఎండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డులకు తరలించి ఎరువును తయారు చేయాలన్నారు. అంతకుముందు ఆయన గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీనివాస్, రాజు, షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలను సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి

రామారెడ్డి, మే 18: జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు శనివారం మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. రెడ్డిపేట్, జగదాంబతండా గ్రామాల్లో పర్యటించిన ఆయన ఆయా గ్రామాల్లో కంపోస్ట్ షెడ్లను పరిశీలించారు. గ్రామ పంచాయతీల్లో రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎల్పీవో సురేందర్, ఎంపీడీవో సవితారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నరేశ్, అరవింద్‌రెడ్డి ఉన్నారు.



రెడ్డిపేట్‌లో కంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్‌రావు

## ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్ చోరీ



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

ఎల్లారెడ్డి, మే 18: నాగిరెడ్డిపేట మండలంలోని లింగంపల్లి శివారులో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి గుర్తుతెలియని దుండగులు ఆయిల్‌ను దొంగిలించినట్లు ట్రాన్స్‌కో ఏఈ మనోరంజన్ రెడ్డి శనివారం తెలిపారు. ఎస్ఎస్ నంబర్ 22, 25ను దొంగలు ధ్వంసం చేసి వాటిలో ఉన్న సుమారు 150 లీటర్ల ఆయిల్‌ను చోరీ చేశారని అన్నారు. దీంతో సంస్థకు సుమారు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## ధాన్యం బస్తాల తరలింపు

ఎల్లారెడ్డి, మే 18: మండలంలోని సోమారిపేట గ్రామంలో వర్షానికి ధాన్యం తడిసి ఇబ్బందులు కలుగుతున్నాయని రైతులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి ధాన్యం బస్తాలను తరలించాలని అధికారులకు ఆదేశించారు. పీఏసీఎస్ డైరెక్టర్ గోపీకృష్ణ, నాయకుడు కుర్మ సాయిబాబా అధికారులతో మాట్లాడి లారీలను తెప్పించారు. ధాన్యం బస్తాలకు రైస్‌మిల్లులకు తరలించారు. రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

రామారెడ్డి, మే 18: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మధుశ్రీవాత్సవ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఎస్సెస్సీ ఇంటర్‌నెట్ మెమో, పాస్ పోర్టు సైజు ఫొటోతో కాలేజీలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ప్రభుత్వ కాలేజీలో చేరాలి

మోర్తాడ్, మే18: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశం పొందాలని కోరుతూ అధ్యాపకులు శనివారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# జీపీఎల్ టోర్నీ విజేత మాస్టర్స్ జట్టు



విజేత జట్టుతో టోర్నీ నిర్వాహకులు

గాంధారి, మే 18: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల మైదానంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న గాంధారి ప్రీమియర్ లీగ్ (జీపీఎల్) క్రికెట్ టోర్నీ శనివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో మండల కేంద్రానికి చెందిన విరాట్ మాస్టర్స్ జట్టు విజేతగా నిలువగా.. ఫైర్ హంటర్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్లకు నిర్వాహకులు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలు, చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో వడ్ల ప్రకాశ్, మమ్మాయి భాస్కర్, గంగప్రసాద్‌గౌడ్, తూర్పు సందీప్, నితిన్ రావు, అభిలాశ్, ఆకుల రాజేశ్, నిఖిల్‌రావు, కళ్యాణ్‌రావు, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

ఎల్లారెడ్డి, మే 18: ఎల్లారెడ్డి పట్టణ శివారులో ఉన్న విద్యుత్ ఉపకేంద్రంలో అధికారులు శనివారం సాయంత్రం మరమ్మతు పనులు చేపట్టారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రెండు గంటలపాటు పనులు చేసినట్లు ఏఈ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. పట్టణంలో విద్యుత్ సరఫరాను నిలిపి వేసి పనులు చేపట్టారు. ప్రతి రెండు వారాలకు ఒకసారి మరమ్మతు పనులు చేపడతామని ఏఈ వివరించారు.



మరమ్మతు పనులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

## వైభవంగా ఆరాధనోత్సవాలు



వీరబ్రహ్మేంద్రస్వామికి పూజ చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

ఎల్లారెడ్డి రూరల్, మే 18: పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయస్థలంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి చిత్రపటానికి ప్రత్యేకపూజలు చేసిన అనంతరం జెండాను ఆవిష్కరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వడ్ల విశ్వనాథం, వడ్ల వెంకటేశం, ప్రవీణ్‌చారి, రాంచందర్‌చారి, నాగభూషణం చారి, నవీన్‌చారి, వడ్ల కలికర్ తదితరులు పాల్గొన్నారు.